క్లుప్తంగా

వ్యక్తిగత శుభ్రతతోనే ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

సదుం: వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం కలుగుతుందని డాక్టరు లావణ్య తెలిపారు. మండలంలోని చెరుకువారిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం కిశోర బాలికలకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు ఆరోగ్యంపై దృష్టిపెట్టాలన్నారు. చిన్న వయసులో పెళ్లి చేసుకోవడం వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని చెప్పారు. మహిళా పోలీస్ చరీనా మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌తోపాటు ఇతర అవాంఛనీయ సంఘటనలు ఎదురైతే తీసుకోవాల్సిన ఆత్మరక్షణ చర్యలను వివరించారు. అత్యవసర సమయాలలో ఉపయోగించాల్సిన టోల్ ఫ్రీ నంబర్ల వివరాలు తెలియజేశారు.

19న క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక



మాట్లాడుతున్న ఎంఈవో సిద్ధరామయ్య

పులిచెర్ల(కల్లూరు) : ఈ నెల 19న కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో అండర్–14, 17 విభాగాల్లో క్రీడా పోటీలకు విద్యార్థులను ఎంపిక చేయనున్నట్టు ఎంఈవోలు సిద్ధరామయ్య, పోకల తాతయ్య తెలిపారు. వారు గురువారం ఎమ్మార్సీలో హెచ్ఎంలు, పీఈటీలతో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే క్రీడా పోటీల్లో మండల స్థాయిలో కల్లూరులో ఎంపిక చేపడుతున్నట్టు తెలిపారు. ఇక్కడ ఎంపికైన వారు జిల్లా స్థాయి, ఆ తర్వాత రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు నడుం బిగించాలి



రొంపిచెర్ల : మాట్లాడుతున్న సీడీపీవో వాణిశ్రీదేవి

రొంపిచెర్ల: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పులిచెర్ల సీడీపీవో వాణిశ్రీదేవి తెలిపారు. ఆమె గురువారం రొంపిచెర్ల కేజీబీవీలో సంకల్ప కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చిన్న వయసులోనే పెళ్లి చేయడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తుంటే ఐసీడీఎస్, పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం పౌష్టికాహారం, స్కిల్ డెవలప్‌మెంట్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, నెలసరి శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హేమలత, సూపర్‌వైజర్ శిరీష, అంగన్‌వాడీ టీచర్లు అలివేలు, హసీన, లావణ్య, సంపత్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

17న మండల సమావేశం

చౌడేపల్లె: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో 17న మండల సాధారణ సర్వసభ్య సమావేశంను నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో షబ్బీర్ అహమ్మద్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు. అలాగే తమ శాఖల పరిధిలో అభివృద్ధి నివేదికలు తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

పిల్లలకు అర్థమయ్యేలా బోధన ఉండాలి



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న గోపీనాయక్

చౌడేపల్లె: మోడల్ ప్రైమరీ పాఠశాలలో పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా పాఠ్యాంశాలను బోధించాలని స్టేట్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ గోపీనాయక్ తెలిపారు. ఆయన గురువారం స్థానిక ఉన్నత పాఠశాలలో మండలంలోని మోడల్ ప్రైమరీ పాఠశాలలైన గోసులకురప్పల్లె, పందిళ్లపల్లె, పరికిదొన, చౌడేపల్లె పాఠశాలల్లోని హెచ్ఎంలకు 3, 4, 5 తరగతుల స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక చొరవ తీసుకుని బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు కేశవరెడ్డి, తిరుమలమ్మ, మండల కోఆర్డినేటర్ మురళి, సీఆర్పీ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

నియోజకవర్గ బూత్ అధ్యక్షుల నియామకం

కుప్పం: కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని బూత్‌లకు వైఎస్సార్ సీపీ బూత్ అధ్యక్షులను నియమించినట్లు ఎమ్మెల్సీ భరత్ గురువారం ఓ ప్రకటలో తెలిపారు. శాంతిపురం మండలానికి విజయ్ కుమార్, రామకుప్పానికి సుగుణప్ప, గుడుపల్లెకు టి.సంపంగి, కుప్పానికి కేపీ కుప్పన్, కుప్పం మున్సిపాలిటీకి జతిన్‌ను నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. వీరు ఆయా మండలాల్లోని బూత్‌ల నిర్వహణపై పర్యవేక్షణలో ఉంటారని తెలిపారు.

టిడ్కో గృహాల వద్ద రేషన్ షాపు

పుంగనూరు: పట్టణంలోని గూడూరుపల్లె వద్ద వున్న టిడ్కో గృహాల వద్ద రేషన్‌షాపు ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ రాము తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం స్థలాన్ని పరిశీలించారు. లబ్ధిదారుల కోరిక మేరకు షాపు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఘనంగా ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలు

రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం పలమనేరు, కుప్పం, పుంగనూరు నియోజకవర్గాల్లో ఘనంగా జరుపుకున్నారు. కేక్‌లు కట్ చేసి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. పలుచోట్ల ప్రజలకు అన్నదానం చేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పెట్టిన మద్యం అక్రమ కేసులో ఎంపీ మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటికి వస్తారని ఆకాంక్షించారు. ఎప్పటికైనా ధర్మమే గెలుస్తుందని, మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు.



పులిచెర్లలో ఎంపీ జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న నాయకులు



పుంగనూరు బస్టాండులో అన్నదానం చేస్తున్న చైర్మన్ అలీమ్‌బాషా, రాజేష్ తదితరులు

పులిచెర్లలో..

పులిచెర్ల(కల్లూరు) : రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం పులిచెర్లలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, జిల్లా ప్రింటింగ్ ప్రెస్ మాజీ చైర్మన్ గోటూరి మురళీమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు.

పుంగనూరులో..

పుంగనూరు: రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం పుంగనూరు పట్టణంలోని రాజన్న విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ యూత్ నాయకుడు రాజేష్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, జిల్లా యూత్‌వింగ్ కార్యదర్శి కొత్తపల్లె చెంగారెడ్డి ఘనంగా నిర్వహించారు. పేదలకు అన్నదానం చేశారు.

సదుంలో..

సదుం : ఎంపీ మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం సదుంలో జెడ్పీటీసీ సోమశేఖర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రెడ్డెప్ప రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నేతాజీ, వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో రొంపిచెర్లలోని జీ.కే ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. రొంపిచెర్ల పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

ఎప్పటికైనా న్యాయం గెలుస్తుంది

పలమనేరు: ఎప్పటికైనా న్యాయం గెలుస్తుందని, ఎంపీ మిథున్‌రెడ్డి మద్యం అక్రమ కేసులో కడిగిన ముత్యంలా బయటికి వస్తారని వైఎస్సార్ సీపీ పలమనేరు మున్సిపల్ కన్వీనర్ హేమంత్‌కుమార్ రెడ్డి తెలిపారు. పట్టణంలో గురువారం ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారీ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. పెద్ద ఎత్తున బాణసంచా పేల్చారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె : రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం బైరెడ్డిపల్లెలో ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, జెడ్పీటీసీ ఆర్.కేశవులు, రాష్ట్ర వైఎస్సార్ సీపీ కార్యదర్శి బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, వైస్ ఎంపీపీలు రూప జయకుమార్‌రెడ్డి, నారాయణస్వామి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. కేక్‌కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ప్రజలకు అన్నదానం చేశారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం చౌడేపల్లెలో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో చౌడేపల్లె సర్పంచ్ వరుణ్‌భరత్ ఆధ్వర్యంలో 101 లీటర్ల పాలతో అభిషేకం చేశారు. అక్రమ కేసులో కడిగిన ముత్యంలా బయటకు రావాలని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 101 టెంకాయలు కొట్టారు. బస్టాండులో ఎస్వీసీ చారిటబుల్ ట్రస్ట్ నుంచి వచ్చిన అంబులెన్స్‌లో 16 మంది రక్తదానం చేశారు. చౌడేపల్లె బస్టాండులో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి మిద్దింటి కిషోర్ బాబు, మాజీ బోయకొండ చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ ఆధ్వర్యంలో భారీగా అన్నదానం చేశారు.



చౌడేపల్లె: అన్నదానం చేస్తున్న మిద్దింటి కిషోర్‌బాబు



చౌడేపల్లె : రక్తదానం చేస్తున్న మహిళా కార్యకర్త

రామకుప్పంలో..

రామకుప్పం(కుప్పం) : రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం రామకుప్పం వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కో కన్వీనర్ చంద్రారెడ్డి నివాసంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.



రామకుప్పం: కేక్ కట్ చేస్తున్న నాయకులు



సదుం: కేక్ కట్ చెస్తున్న జెడ్పీటీసీ సోమశేఖర్ రెడ్డి



రొంపిచెర్ల : పండ్లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



పలమనేరులో కేక్ కోస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



బైరెడ్డిపల్లెలో నేతల సంబరాలు



కుప్పంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ భరత్

మెడికల్ కళాశాలను ప్రైవేటుకు ఇవ్వడం ఘోరం

- గతంలో ఏ ప్రభుత్వంలోనైనా ఇలా జరిగిందా
- యూరియా ఉంటే రైతులు రోడ్డెందుకు ఎక్కుతారు
- పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆగ్రహం



మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: పేద విద్యార్థులకు సైతం మెడికల్ విద్య అందుబాటులోకి రావాలనే లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలను తీసుకువచ్చిందని, వాటిని కూటమి ప్రభుత్వం ప్రైవేటు పరం చేయాలనుకోవడం దారుణమని పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. కమీషన్ల కోసమే మెడికల్ కళాశాలను ప్రైవేటు పరం చేయాలని చూస్తోందని ఆరోపించారు. రైతులకు గత ఐదేళ్లలో ఏనాడూ యూరియా సమస్య రాలేదని పేర్కొన్నారు. ఇప్పుడు యూరియా కోసం భారీగా క్యూలలో ఎందుకు నిలబడాల్సి వస్తోందని ప్రశ్నించారు. తగినంత యూరియా అందుబాటులో వుంటే రైతులు రోడ్డుపైకి ఎందుకు వస్తాయని నిలదీశారు. గత వైఎస్సార్ సీపీ పాలన, కూటమి ప్రభుత్వ పాలనకు ఉన్న తేడాను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఇందుకు బహుమతిగా రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పడం ఖాయమని వెల్లడించారు.

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

పుంగనూరు: కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో 57ను తక్షణం అమలు చేయాలని 2003 సంవత్సరం డీఎస్సీ ఫోరం టీచర్లు డిమాండ్ చేశారు. వారు గురువారం సంఘ నాయకుడు మోహన్‌యాదవ్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57ను 16 రాష్ట్రాలలో అమలు చేస్తున్నారని, ఇక్కడ ప్రభుత్వం అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో కడియాల మురళి, అయూబ్‌ఖాన్, మంజునాథ్, బుడ్డన్న, శంకర్, లింగమూర్తి, శ్రీరాములు రెడ్డి, శ్రీనివాసులు, రాజేష్, కిరణ్, బాలరాజు, దీపారాణి, శ్వేత, గంగులమ్మ, సౌజన్య, మణి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

బాలికా విద్యతోనే దేశ ప్రగతి



విద్యార్థులకు కేక్ తినిపిస్తున్న ఉపాధ్యాయులు

కుప్పం రూరల్ : బాలికా విద్యతోనే దేశ ప్రగతి సాధ్యమని అడవిబూదుగూరు ప్రాథమిక పాఠశాల హెచ్ఎం చిట్టిబాబు తెలిపారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా గురువారం పాఠశాలలో కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. ఆయన మాట్లాడుతూ బాలికల విద్య దేశం, సమాజాభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. తల్లిదండ్రులు బాలికలను విద్యలో ప్రోత్సహించాలన్నారు. ఉపాధ్యాయులు విజయేంద్రరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.55 వేలు



హుండీలోని కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

చౌడేపల్లె: స్థానిక బజారువీధిలో వున్న అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ హుండీలోని కానుకల ద్వారా రూ.55,116 ఆదాయం వచ్చినట్టు ఈవో కమలాకర్ తెలిపారు. ఆలయంలో గురువారం హుండీలోని కానుకలను లెక్కించగా మూడు నెలలకు గాను ఆదాయం వచ్చిందని తెలిపారు. దీన్ని ఆలయ అభివృద్ధి ఖాతాలో జమచేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ శశికుమార్ పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన ఎంపీపీ



ఎంపీకి శుభాకాంక్షలు తెలుపుతున్న యువరాజు

వి.కోట: ఎంపీ మిథున్‌రెడ్డిని గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో వి.కోట ఎంపీపీ యువరాజు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

స్పెషల్ ఎడ్యుకేషన్ డీఎస్సీ ఇవ్వాలి

పలమనేరు: రాష్ట్రంలోని స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయ పోస్టులకు వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని స్థానిక స్పెషల్ ఎడ్యుకేషన్ అభ్యర్థులు డిమాండ్ చేశారు. వారు గురువారం డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పలమనేరు నియోజకవర్గం నుంచి విజయవాడలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి తరలివెళ్లారు. వారు మాట్లాడుతూ స్పెషల్ ఎడ్యుకేషన్ చేసిన వారికి ఏళ్ల తరబడి డీఎస్సీ నిర్వహించకుండా ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలను సైతం కూటమి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పెషల్ బీఈడీ వారికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో నేతలు అరుణ్‌కుమార్, భర్కత్, దొండారాం నాయక్, రాజా, వేలు, రవినాయక్ పాల్గొన్నారు.

యూరియా కోసం తప్పని తిప్పలు



యూరియా కోసం వచ్చిన రైతులు

కుప్పం: యురియా కోసం కుప్పం రైతులు పడుతున్న అగచాట్లు అన్నీ ఇన్నీ కావు. కుప్పం పట్టణంలోని అన్ని ఎరువుల దుకాణాల్లో యూరియా అందుబాటులో వున్నట్టు మూడు రోజుల క్రితం అధికారులు ప్రకటించారు. అక్కడికి వెళ్లిన రైతులకు వ్యాపారులు స్టాకు లేదని చెబుతూ సినిమా చూపిస్తున్నారు. పలువురు రైతులు గురువారం హెచ్‌పీ రోడ్డులోని ఎరువుల స్టాకు పాయింట్ వద్దకు వచ్చారు. వ్యాపారులు కొంత మందికి మాత్రమే యూరియా అందజేసి స్టాకు అయిపోయిందని చెప్పడంతో రైతులు నిరాశతో వెనుదిరిగారు.

ఉపాధిలో పండ్ల తోటల పెంపకం

శాంతిపురం: ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటలు పెంచుకోవచ్చని ఎంపీడీవో ఏపీఆర్ కుమార్ తెలిపారు. ఆయన గురువారం చెంగుబళ్ల పంచాయతీలో ఉపాధి హామీ పథకం కింద చేస్తున్న పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కింద పండ్ల మొక్కలు నాటేందుకు గుంతలు తీయడం, ఎరువులు, మొక్కలు, నీటి తడులు, సంరక్షణ అన్నింటికీ నిధులు వస్తాయని తెలిపారు. పండ్ల తోటల విస్తరణ ద్వారా రైతుల లాభాలు పెరుగుతాయని చెప్పారు. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలపై కూడా దృష్టి సారించాలని కోరారు. అనంతరం సెరికల్చర్ షెడ్లు, కొత్తగా సాగు చేస్తున్న మల్బరీ తోటలను సందర్శించారు. ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ శంకర్, క్షేత్ర స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.



మల్బరీ తోటలను పరిశీలిస్తున్న ఎంపీడీవో కుమార్

బకాయిలు వెంటనే చెల్లించాలి

పులిచెర్ల(కల్లూరు) : ప్రభుత్వం నుంచి ఉపాధ్యాయులకు రావలసిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర నాయుడు తెలిపారు. ఆయన గురువారం మంగళంపేట హైస్కూల్‌లో రాష్ట్ర కౌన్సిలర్ సదాశివరెడ్డి, జిల్లా కార్యదర్శి ఈశ్వర మహేంద్ర, మండల యూటీఎఫ్ నాయకులతో కలిసి యూటీఎఫ్ రణభేరి పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర పూర్తియినా 4 డీఏలు చెల్లించలేదన్నారు. పీఆర్సీ కమిషన్‌ను నియమించాలన్నారు. డీఎస్సీలో ఎంపికైన వారికి వెంటనే నియామక పత్రాలు అందజేసి ఉపాధ్యాయుల కొరత తీర్చాలన్నారు. ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న యూటీఎఫ్ రణభేరి బైక్ ర్యాలీలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల యుటిఎఫ్ గౌరవ అధ్యక్షుడు నాన్కినాయక్ ,దేవేంద్రరెడ్డి,జయప్రకాష్‌రెడ్డి,సీవిరమణ తదితరులు పాల్గొన్నారు.



యూటీఎఫ్ రణభేరి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

సమస్యలు తీర్చండి సారూ..!

శాంతిపురం : ఏళ్లతరబడి అపరిష్కృతంగా వున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని వైఎస్సార్ సీపీకి చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు కోరారు. వారు గురువారం ఎంపీడీవో ఏపీఆర్ కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పంచాయతీ స్థాయిలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పాటించడం లేదన్నారు. కొందరు కార్యదర్శులు తమకు కనీస సమాచారం కూడా ఇవ్వడం లేదని చెప్పారు. పంచాయతీల ఖాతాలకు జమ అయిన నిధులను నిబంధనల మేరకు వినియోగించుకునే వీలు కల్పించాలని కోరారు. స్పందించిన ఎంపీడీవో గ్రామాల్లో హైమాస్ లైట్లు, స్ట్రీట్ లైట్లను ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందన్నారు. నిబంధనల మేరకు అర్హులైన అందరికీ పింఛన్లు, పక్కా ఇళ్లు మంజూరుచేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, వైస్ ఎంపీపీలు పట్టాభి, సరస్వతి రమేష్, సర్పంచులు ఏపీ జయరాం, గోపాల్, రాధాకృష్ణ, వెంకట్రామరెడ్డి, చిన్నప్ప, గజ్జల మోహన్, భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీలు ఆర్ముగం, చలం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవో కుమార్‌తో చర్చిస్తున్న ప్రజాప్రతినిధులు

దెబ్బతింటున్న కౌండిన్య బ్రిడ్జి

- బ్రిడ్జి సమీపంలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు
- జేసీబీలతో పెద్ద పెద్ద గుంతలు తోడిన వైనం
- ఫారెస్ట్ నగరవనం ప్రహరీ సైతం కూలేందుకు సిద్ధం
- పట్టించుకోని అధికారులు, పోలీసులు



బ్రిడ్జి వద్ద తోడేసిన ఇసుక గుంతలు, బ్రిడ్జి పక్కనున్న ఫారెస్ట్ నగరవనం ఫెన్సింగ్ దాకా తోడేసిన దృశ్యం



కౌండిన్య బ్రిడ్జి కింద ఇసుక తవ్వేయడంతో పడిన గుంతలు

పలమనేరు: పలమనేరు సమీపంలోని కౌండిన్య నదిలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. కూటమి నేతలు అధికారాన్ని అడ్డుపెట్టుకుని రాత్రి పగలు తేడా లేకుండా పెద్ద ఎత్తున ఇసుకను తవ్వి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో కౌండిన్య నదిపై చెన్నై- బెంగళూరు హైవేలో నిర్మించిన బ్రిడ్జి ఇసుకాసురుల దెబ్బకు కూలడం ఖాయంగా కనిపిస్తోంది. ఇది గనుక కూలితే ఇక్కడి నుంచి కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు రాకపోకలు లేకుండా పోతాయి. పొరుగునే ఉన్న జీడిమాకులపల్లి గ్రామానికి చెందిన పచ్చ ఇసుకాసురులు గత ఏడాదిగా ఈ బ్రిడ్జి పక్కన జేసీబీలతో ఇసుకను వేలాదిలోడ్లు తవ్వి తరలించేస్తున్నారు. నదిలో ఇటీవల నీరు చేరడంతో వీరి కన్ను బ్రిడ్జిపై పడింది. దీంతో వంతెనకు ఇరువైపులా ఇప్పటికే జేసీబీలతో ఇసుకను తోడేశారు. దీంతో బ్రిడ్జి కింది భాగం దెబ్బతినింది. దీంతోపాటు వంతెన వెనుక, తూర్పు వైపునున్న అటవీశాల నగరవనం ఫెన్సింగ్ సైతం కూలిపోయింది. అక్కడున్న భారీ చెట్లు వేర్లతో సహా కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. పరమడ వైపు వెటర్నరీ విశ్వవిద్యాలయానికి చెందిన భూముల్లోనూ ఇసుకాసురులు ఇసుకను తోడేశారు. నదిలోని నీటిలో ఉన్న ఇసును సైతం రాత్రుళ్లు జేసీబీల ద్వారా లాగి దాన్ని ఆరబెట్టి పగలు అమ్మకాలు సాగిస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధి వాహన డ్రైవర్ అండతోనే ఇసుకాసురులు రెచ్చిపోతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా నేషనల్ హైవే, ఫారెస్ట్, యూనివర్సిటీ, ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు, మైనింగ్ శాఖల అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

15, 16 తేదీల్లో క్రీడా పోటీలు

శాంతిపురం: పాఠశాల విద్యాశాఖ, క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 15, 16 తేదీల్లో మండల స్థాయి అథ్లెటిక్స్, గేమ్స్ పోటీలు నిర్వహించనున్నట్టు మండల పీఈటీలు, పీడీల సంఘం అధ్యక్షురాలు షమీనా తెలిపారు. అండర్ 14, అండర్ 17 విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. తొలి రోజు ఎంఈవో కార్యాలయం వెనుక ఉన్న టేలర్ స్కూల్ గ్రౌండ్‌లో అథ్లెటిక్స్, రెండవ రోజున మఠం వద్ద ఉన్న శాంతిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులను పోటీలకు పంపాలని తల్లిదండ్రులు, పాఠశాలల ఉపాధ్యాయులను కోరారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పలమనేరు, కుప్పం : 93981 01870
పుంగనూరు : 96524 21441